ఎపిఎస్ ఆర్‌టిసికి అవార్డు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసి జాతీయ స్థాయిలో అవార్డు దక్కించుకుంది. ప్రతి ఏటా ప్రకటించే ప్రవాస్ 4.0 రెడ్ బస్ పీపుల్స్ చాయిస్ 2024 అవార్డును సాధించింది. ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ అవార్డు సాధనకు కృషి చేసిన ఆర్‌టిసి అధికారులను ఎమ్‌డి ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కెఎస్ బ్రహ్మానందరెడ్డి, చంద్రశేఖర్, వి సుధాకర్, చీఫ్ ఇంజనీర్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-బొమ్మనహాళ (అనంతపురం)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దర్గాహొన్నూరు గ్రామానికి చెందిన రైతు చల్లప్ప గారి రాజప్ప (30) తన రెండెకరాల సొంతపొలంతో పాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, వరి పంటలను సాగు చేసేవారు. రెండు సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడంతో సుమారు రూ. ఐదు లక్షల మేర అప్పుల భారం పెరిగింది. దీనికి తోడు వడ్డీల భారం, రుణదాతల ఒత్తిడి తాళలేక పొలంలో క్రిమిసంహార మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడిపి ఆఫీసుపై దాడి కేసులో సూత్రధారులను అరెస్టు చేయాలి

- వర్ల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కేంద్ర కార్యాలయంపై జరిగిన దాడిలో అసలు సూత్రధారులెవరో తేల్చి వారిని అరెస్టు చేయాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ ఎంపి నందిగం సురేష్ పాత్రదారి మాత్రమేనని, అసలు సూత్రధారులు వేరే ఉన్నారని ఆయన తెలిపారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి తెలియకుండా ఈ దాడి జరిగిందా? అని ప్రశ్నించారు. ఈ దాడికి కుట్ర పన్నిన సూత్రధారులెవ్వరో నిగ్గు తేల్చి అరెస్టు చేయాలని పోలీసులను ఆయన కోరారు.

వేట నిషేధ పరిహారంపై అంతుల్లేని నిర్లక్ష్యం!

- నిషేధం ఎత్తేసి మూడు నెలలు కావొస్తున్నా.. అందని డబ్బులు
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న మత్స్యకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి



చేపల వేట నిషేధం పరిహారం చెల్లింపుల విషయంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎడతెగని జాప్యం చోటు చేసుకుంటోంది. నిషేధం ఎత్తేసి సుమారు మూడు నెలలు కావొస్తున్నా వారి ఖాతాల్లో డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ 61 రోజుల కాలానికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా పరిహారం అందిస్తోంది. ఆ సొమ్ముకే మరో రూ.10 వేలు కలిపి రూ.20 వేలు ఇవ్వాలని టిడిపి కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించినా... ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటివరకు పరిహారం సొమ్మును వారి ఖాతాల్లో జమ చేయలేదు. దీంతో మత్స్యకారులు మత్స్యశాఖ కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరుగుతూ తమకు పరిహారం డబ్బులు ఎప్పుడు ఇస్తారంటూ అడుగుతున్నారు.

వేట నిషేధ పరిహారం చెల్లింపులకు ఈ సంవత్సరం ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఏప్రిల్‌లో చేపట్టాల్సిన సర్వేను మేలో చేశారు. జూన్ మొదటి వారంలో అన్ని జిల్లాల నుంచి అర్హుల జాబితాలను ప్రభుత్వానికి పంపారు. కూటమి ప్రభుత్వం కొత్తగా అధికారం చేపట్టడంతో పరిహారం చెల్లింపుల జోలికి వెళ్లలేదు. ఆ తర్వాత మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ ఏడాది జులై పదో తేదీన అమరావతిలో మత్స్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి రీసర్వే చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు లబ్ధిదారుల వివరాలు, ఆధార్, బ్యాంకు ఖాతాలను పరిశీలించి మరోసారి జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. ఆ జాబితాను పక్కన పెట్టి కొత్తగా సర్వే చేయాలని, అందుకు సంబంధించి మార్గదర్శకాలు వెలువరిస్తామని ఉన్నతాధికారులు సమాచారమిచ్చారు. సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌నూ పంపిస్తామని ఆగస్టు ఎనిమిదో తేదీన చెప్పారు. నెల రోజులు గడచినా నేటికీ యాప్‌నూ పంపించలేదు. మార్గదర్శకాలనూ వెలువరించలేదు.

మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు

మే మూడు, నాలుగు తేదీల్లో డేటా వెరిఫికేషన్, ఎంట్రీ చేశారు. మే ఆరు నుంచి పదో తేదీ వరకు లబ్ధిదారుల వివరాలను నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. మే 14న సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. తర్వాత మే 15 నుంచి 17 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. మే 18, 19 అభ్యంతరాలను పరిష్కరించారు. మే 22న లబ్ధిదారుల వడపోత, జాబితా తయారీ చేపట్టారు. జూన్ నెల మొదటి వారం నాటికి జాబితాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఆ జాబితా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 1,30, 128 మంది మత్స్యకారులను సర్వే చేశారు. వీరిలో ప్రాథమికంగా 1,05,387 మందిని అర్హులుగా గుర్తించారు. మత్స్యకార భరోసాకు గత ప్రభుత్వం విధించిన రకరకాల కారణాలతో 24,741 మందిని అనర్హులుగా పెండింగ్‌లో ఉంచారు. వీటిలో డీజిల్ వాడకం నిబంధనతో 18 వేల మందిని పెండింగ్ జాబితాలో చేర్చారు. దీంతో పాటు మత్స్యకార భరోసాకు గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం అమలు చేసిన నిబంధనలతో సుమారు ఆరు వేల మంది వరకు అనర్హులుగా అధికారులు పేర్కొన్నారు. వీటిపై టిడిపి కూటమి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత వీటిపై ఒక స్పష్టత వస్తుందని అధికారులు చెప్తున్నారు.

రైల్‌నీర్‌ప్లాంట్ నుంచి వి'యవాడకు నీళ్ల బాటిళ్లు ఇవ్వండి

- రైల్వేశాఖమంత్రి అశ్విని వైష్ణవ్‌కు షర్మిల లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదలతో విజయవాడ నగరం అతలాకుతలమైన నేపథ్యంలో విశాఖపట్టణంలోని రైల్ నీర్ ప్లాంట్ నుంచి విజయవాడకు నీళ్ల బాటిళ్లు అందించాలని పిసిసి రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. రైల్వే శాఖకు విజయవాడ డివిజన్ నుంచి రూ.6 వేలకోట్ల ఆదాయం వస్తోందని, ఆదాయం ఆర్జించడమే కాదని, ఆపదసమయంలో ప్రజలను ఆదుకునే బాధ్యత కూడా ఉండాలని లేఖలో ఆమె ప్రస్తావించారు. విజయవాడ నగరంలో వరదల ప్రభావంతో తాగునీటి సరఫరా పైప్‌లైన్లు భారీగా సిల్ట్‌తో నిండిపోయాయని ఆమె పేర్కొన్నారు. సిల్ట్‌ను తొలగించి మళ్ళీ నీటిని సురక్షితంగా మార్చే ప్రక్రియ చాలా సమయం పడుతుందన్నారు. అప్పటి వరకు నగర ప్రజలకు తాగునీటికి ప్రత్యామ్నాయమార్గాలు ఉండాలని ఆమె పేర్కొన్నారు. రూ.6వేలకోట్ల ఆదాయం తీసుకొచ్చే విజయవాడ డివిజన్‌కు విపత్తు సమయంలో వారికి సహాయం చేయడం భారతీయ రైల్వేయొక్క విధి అని షర్మిల పేర్కొన్నారు.

సైనేడ్‌తో మట్టుబెట్టారు

- మహిళలను హత్య చేస్తున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నిందితులు

జల్సాలకు అలవాటు పడి సునాయసంగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో సైనేడ్ ప్రయోగంతో వేర్వేరు ఘటనలతో నలుగురిని హతమార్చిన ముగ్గురు మహిళలను గుంటూరు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మీడియా సమావేశంలో జిల్లా ఎస్‌పి సత్.సతీష్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. తెనాలికి చెందిన మునగప్ప రజనీ, మడియాల వెంకటేశ్వరి, గొంతు రమణమ్మలకు ఎసి మెకానిక్ కృష్ణతో పరిచయం ఏర్పడడంతో అతని ద్వారా తెనాలిలో బంగారు వ్యాపారుల వద్ద సైనేడ్ కొనుగోలు చేసేవారు. వెంకటేశ్వరి గతంలో వలంటీరుగా పనిచేశారు. జూన్ 5న తెనాలికి చెందిన షేక్ నాగూర్‌బి అనే మహిళను వడ్లమూడి వద్ద వైన్‌లో సైనేడ్ కలిపి తాగించి చంపారు. వెంకటేశ్వరి తన అత్త సుబ్బులక్ష్మికి కూడా మద్యంలో సైనేడ్ కలిపి హతమార్చింది. తరువాత ఆస్తి, బంగారు ఆభరాలను కాజేశారు. 2023 ఆగస్టులో తెనాలికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలిని థమ్స్‌అప్‌లో సైనేడ్ కలిపి హత్య చేశారు. ఈ ఘటనలో వెంకటేశ్వరి, ఆమె తల్లి రమణమ్మ కూడా పాల్గొన్నారు. 2024లో తెనాలిలో మోషే అనే వ్యక్తి భార్య భూదేవితో ఘర్షణ పడుతుండగా ఆమెను సంప్రదించిన నిందితులు అతన్ని చంపి ఆస్తి అంతా పంచుకుందామని ఒప్పందం చేసుకుని అతన్ని హతమార్చారు. తెనాలికి చెందిన అన్నపూర్ణపై కూడా సైనేడ్ ప్రయోగం చేయగా వికటించి ఆమె బతికిందని ఎస్‌పి తెలిపారు.

వైసిపి రాష్ట్ర ఆర్‌టిఐ విభాగం అధ్యక్షురాలుగా కల్పలతా రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మరో మూడు అనుబంధ సంఘాలకు అధ్యక్షులను ప్రకటించింది. వైసిపి ఆర్‌టిఐ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలుగా ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డిని నియమించారు. అలాగే వైసిపి వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా కుప్పం ప్రసాద్, మైనార్టీ సెల్ విభాగానికి బి జాన్‌వెస్లీని నియమించారు. ఈ మేరకు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం వైసిపి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.



అదానీ గంగవరం పోర్టు గేటు వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు విడుదల చేయాలి

- గంగవరం పోర్టు వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం, గాజువాక (విశాఖపట్నం)

విశాఖలోని స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గు తరలించకుండా ఆటంకాలు సృష్టిస్తున్న అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తీరును, ప్రభుత్వ వైఖరిని విశాఖ ఉక్కు ఉద్యోగుల సంఘం (సిఐటియు) తీవ్రంగా ఖండించింది. తక్షణమే స్టీల్ ప్లాంట్‌కు బొగ్గు విడుదల చేయాలని గంగవరం పోర్టు గేటు వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ.. విదేశాల నుంచి కొనుగోలు చేసిన కోల్ గంగవరం పోర్టుకు చేరుకోగా అది స్టీల్‌ప్లాంట్ వరకూ చేరకుండా అదానీ యాజమాన్యం, కొంతమంది కాంట్రాక్టర్లు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. వారికి రావాల్సిన కొద్దిపాటి ఆర్థిక మొత్తాల కోసం రూ.వేల కోట్లతో కొన్న కోల్‌ను అడ్డుకోవడం, కోర్టులను ఆశ్రయించి స్టేలు తెచ్చుకుని ఆటంకాలు కల్పించడం దారుణమన్నారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ.. బొగ్గు కొరతతో ఉత్పత్తిపై తీవ్రప్రభావం పడుతుందన్నారు. యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్లాంట్ సందర్శనలో చెప్పిన మాటలు ఆచరణకు నోచుకోలేదన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన సహాయ సహకారాలు అందడం లేదని పేర్కొన్నారు. సీనియర్ నాయకులు ఎన్.రామారావు మాట్లాడుతూ... ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 10న జరిగే రాష్ట్ర వ్యాప్త రాస్తారోకోలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరాజు, కె.గంగాధర్, పుల్లారావు, నీలకంఠం, వి.ప్రసాద్, మురళి, శ్రీనివాస్ రెడ్డి, స్టీల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాస్, నమ్మి రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసు నమోదు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తిరుపతి ఈస్టు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. డిఎస్‌పి వెంకట నారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. లైంగిక వేధింపులు, అత్యాచారంపై 164, 351 (2) బిఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలు గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి తిరుపతి ఈస్టు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆదిమూలంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన జరిగిన హోటల్లో సిసి పుటేజీని సేకరించి దర్యాప్తును ముమ్మరం చేశారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనను బెదిరించి లైంగికంగా వేధిస్తున్నారని తెలుగుదేశం పార్టీకి చెందిన ఓ మహిళ నాయకురాలు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదిమూలం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారనే ప్రచారం జరిగింది. ఇదంతా మార్ఫింగ్ వీడియో అని, తనపై కుట్ర పన్నారని ఆదిమూలం వాదించినా ఫలితం లేకపోయింది. ప్రాథమిక ఆధారాలతో ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు ప్రకటించారు. ఇదిలావుండగా శుక్రవారం ఆదిమూలం చెన్నైలోని అపోలో హాస్పిటల్‌లో చేరినట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. గుండెపోటుతో ఆయన చేరారని, ఆయనకు స్టంట్లు కూడా వేశారని పేర్కొన్నారు.

అక్టోబర్‌లో విశాఖ - వి'యవాడ మధ్య విమాన సర్వీసు

- మంత్రి రామ్మోహన్‌నాయుడు
- విశాఖలో 'డిజి యాత్ర' సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



డిజి యాత్ర సేవలను ప్రారంభిస్తున్న మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖ - విజయవాడ మధ్య అక్టోబర్ 27 నుంచి కొత్తగా విమాన సర్వీసును ప్రారంభించనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. విశాఖ ఎయిర్ పోర్టు సహా దేశంలోని తొమ్మిది ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికుల 'డిజి యాత్ర' సేవలను ఆయన విశాఖలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్ పోర్టు టెర్మినల్‌లోకి ప్రయాణికులు ప్రవేశించగానే పలు రకాల చెకింగ్‌లు, అంతరాయాలతో నిమిషాల పాటు సమయం పట్టేదని, డిజి యాత్ర సేవల ద్వారా సెక్యూరిటీ క్లియరెన్స్‌లు ఐదు సెకన్లలో జరిగిపోతాయని తెలిపారు. ప్యాసింజర్లు సులువుగా ప్రయాణించేందుకు వీలుగా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ (డిజి యాత్ర)ని ప్రారంభిస్తున్నామన్నారు. ఎయిర్ పోర్టుల్లో ప్రయాణికులు ఆగకుండా ముందుకు సాగేందుకు డిజి సేవలు దోహదపడతాయని తెలిపారు. విశాఖ ఎయిర్ పోర్టు నుంచే ఆన్‌లైన్ ద్వారా రాంచీ, భువనేశ్వర్, ఇండోర్, రాయ్‌పూర్, పాట్నా, గోవా, కోయంబత్తూరుల్లో డిజి యాత్ర సేవలను మంత్రి ప్రారంభించారు.

తాజా వాటితో కలిపి మొత్తంగా దేశంలో 24 విమానాశ్రయాల్లో డిజి యాత్ర సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇంతవరకూ మూడు కోట్ల మంది ప్రయాణికులు డిజి యాత్ర సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. డిజి యాత్ర సేవలకు సంబంధించిన యాప్‌ను దేశంలో 54 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకుని వాడుతున్నారన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు విశాఖ నుంచి కనెక్టివిటీ, బ్రిడ్జిల నిర్మాణం వంటి వాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, ఎయిర్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) చైర్మన్ సురేష్, విశాఖ ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు.

రొయ్యల పెంపకంపై దృష్టి పెట్టండి

- మత్స్య ఎగుమతుల ప్రోత్సాహక సదస్సులో కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, చిత్రంలో సహాయ మంత్రి జార్జి కురియన్

రొయ్యల పెంపకం బలోపేతంపై దృష్టి సారించాలని కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు. విశాఖలోని నోవటెల్ హోటల్‌లో శుక్రవారం మత్స్య ఎగుమతుల ప్రోత్సాహంపై వాటాదారుల సంప్రదింపుల కోసం ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థలో మత్స్య రంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. స్మార్ట్, ఇంటిగ్రేటెడ్ హార్బర్ల అభివృద్ధి ద్వారా గుర్తించదగిన, స్థిరమైన చేపల ఎగుమతులకు కేంద్రం సహకరిస్తుందని వివరించారు. ఎఐ, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాలను చేర్చి ఈ రంగాన్ని మరింత మెరుగుపరచనుందని తెలిపారు. కేంద్ర మత్స్య, పశు సంవర్థక, పాడి పరిశ్రమ, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్ మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యశాఖకు ఆర్థిక కేటాయింపులను పెంచిందన్నారు. ఫీడ్ ఇన్‌పుట్స్, పదార్థాలపై సుంకాలను తగ్గించినట్లు తెలిపారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద చేపల ఉత్పత్తిదారుగా భారత్ నిలిచిందని, 2022-23లో 17.5 మిలియన్ టన్నుల చారిత్రాత్మక ఉత్పత్తి మైలురాయిని చేరుకుందని వెల్లడించారు. నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యాన జరిగిన ఈ సమావేశంలో మత్స్య శాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖీ, ఆల్ ఇండియా రొయ్యల, హేచరీస్ అసోసియేషన్ అధ్యక్షులు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లలో నష్టాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు మదుపర్ల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 1,017 పాయింట్లు పతనమై 81,183కు దిగజారింది. ఇదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 292 పాయింట్లు కోల్పోయి 24,852 వద్ద ముగిసింది. కాగా.. ఒక్క పూటలోనే మదుపర్ల సంపద రూ.5లక్షల కోట్లు ఆవిరయ్యింది. సెన్సెక్స్-30లో ఎస్‌బిఐ, బిపిసిఎల్, ఐసిఐసిఐ బ్యాంక్, ఎన్‌టిపిసి, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటిసి, టాటా మోటార్స్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

అందరికీ శ్రీవారి లడ్డూ ప్రసాదాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాలు, సమాచార కేంద్రాలలో లడ్డూ ప్రసాదాలను శాశ్వతంగా విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టిటిడి ఇఒ శ్యామలరావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఇఒ కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియాతో ఇఒ మాట్లాడుతూ... తిరుమలలో లడ్డూ దళారులను కట్టడి చేయడం ద్వారా బయట ప్రాంతాలకు ప్రసాదాలు పంపుతున్నట్లు వివరించారు. ఆగస్టు నెలలో 22.42 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని, 125.76 కోట్లు హుండీ ద్వారా ఆదాయం వచ్చిందన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ నాలుగు నుంచి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

త్వరలో దివ్య దర్శనం టోకెన్లు జారీ

తిరుమలకు కాలినడకన వచ్చే యాత్రికులకు త్వరలో అలిపిరి పాదాల మండపం వద్ద దివ్యదర్శనం టోకెన్ల జారీని పునఃప్రారంభించనున్నట్లు ఇఒ చెప్పారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలు, అన్న ప్రసాదాల నాణ్యత పెంచేందుకు టిటిడి చేపట్టిన చర్యలను పలువురు యాత్రికులు ఫోన్‌లో ప్రశంసించారు.

VSF PROJECTS LIMITED

CIN: L05005AP1992PLC014326
Registered Office: Sy.No.782 to 1236,
Ankulapatur Village Chillakur Mandal, Tirupathi District, AP-524 412,
Phone: 040- 40102929, Website: www.vsfprojects.com, email: vsfprojectsltd91@gmail.com

NOTICE

The 32nd Annual General Meeting [AGM] of the members of VSF Projects Limited will be held at 3.00 P.M. on Monday, 30th, September 2024 at the Registered office of the Company at Sy.No.782 to 1236 Ankulapatur Village Chillakur Mandal, Tirupathi District, AP-524 412 to transact the business mentioned in the Notice convening AGM. Notice together with Annual Report 2023-24 has been posted to the members.

NOTICE is also hereby given pursuant to the provisions of Section 91 of the Companies Act, 2013 and applicable rules thereunder, that the Register of Members and the Share Transfer Books of the Company will remain closed from 24th September, 2024 to 30th September, 2024 (both days inclusive) for the purpose of the 32nd AGM.

Please note that the Annual Report of the Company will also be available on the Company's website **www.vsfproject.com** and also available for inspection during 10:30 a.m. to 12:30 p.m. at the Registered Office of the Company on all working days till 30th, September 2024.

E-VOTING:

In compliance of Section 108 of the Companies Act, 2013 and applicable rules thereunder, the Company is pleased to provide the Members, the facility to cast their vote by electronic means (e-voting) on all resolutions set forth in the said notice. The details in this regard, pursuant to the provisions of the Companies Act, 2013 and the Rules are given hereunder:

1. Notice of 32nd AGM and Annual Report of the Company has been sent to all Members holding shares as on 23rd September, 2024 and AGM notice was dispatched on 6th September, 2024.
2. Date and time of commencement of remote e-voting: Thursday 27th September, 2024 from 9 a.m. (IST)
3. Date and time of end of remote e-voting: Sunday 29th September, 2024 at 5 p.m. (IST)
4. Cut-off date for remote e-voting: Monday, 23rd September, 2024.
5. Any person who acquires shares and becomes member of the Company after dispatch of the Notice of AGM and holding shares as on cut-off date, may refer to e-voting instructions available in the annual report and as made available on the website of the Company, however if a person is already registered with CDSL for e-voting, then the existing user ID and password can be used for casting vote.
6. Members may note that
   a. Remote e-voting by electronic mode shall not be allowed by CDSL beyond 5.00 p.m. IST on 29th September, 2024.
   b. Once the voting on resolution is cast by members, they shall not be allowed to change it subsequently
   c. The facility for voting through postal ballot shall be made available at AGM for the members who have not casted their vote by remote e-voting
   d. The members who have casted their vote by remote e-voting prior to AGM may also attend the AGM but shall not be entitled to vote again.
7. The notice of AGM, along with the procedure for remote e-voting, has been sent to all the members by prescribed mode and the same is also available on the website of the Company at **www.vsfproject.com**.
8. For any queries/grievances relating to remote e-voting, members may contact M Rajasekhar, Secretarial Department at the Corporate office of the Company at 1018, 9th Floor, Vasavi MPM Grand, Ameerpet, Hyderabad-500073, E-mail: **csvsfprojectsltd@gmail.com**. Further, Members can also write an email to **helpdesk.evoting@cdslindia.com** regarding any queries or issues regarding e-voting.

BY THE ORDER OF THE BOARD
For **VSF Projects Limited**
Sd/-
Bobba Narayana Murthy
Chairman and Managing Director
(DIN: 00073068)

Place: Hyderabad
Date: 06-09-2024

హెచ్చరికలను పట్టించుకోనందువల్లే...

- వైసిపి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ముందుగానే చేసిన హెచ్చరికలను పట్టించుకోనందువల్లే విజయవాడకు విపత్తు వచ్చిందని వైసిపి మాజీ ఎంఎల్‌ఏ టిజెఆర్ సుధాకర్ బాబు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విపత్తు మీద స్పందించాల్సిన సమయంలో వైసిపి రాజ్యసభ సభ్యుల కొనుగోలు, ముంబై నటి వ్యవహారంలో బిజీగా గడిపారని విమర్శించారు. బుడమేరు ఆధునికీకరణ పనులను చేపడితే టిడిపి నేతల భూములు పోతాయని చంద్రబాబు ప్రభుత్వం 2014-19 దాకా పట్టించుకోలేదన్నారు. బుడమేరు ముంపునుండి ఎలా తప్పించుకోవాలో కార్యాచరణను ప్రభుత్వం తక్షణం ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

- ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం

ప్రజాశక్తి - రాజానగరం (తూర్పు గోదావరి జిల్లా)



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



కార్తీక్ (ఫైల్)

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు వద్ద 216 నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెద ఉదయపురం గ్రామానికి చెందిన రోనంకి ప్రవీణ్ కుమార్ (20), పల్నాడు జిల్లా పుత్తూరు మండలం సవల్యాపురం గ్రామానికి చెందిన చింతా కార్తీక్ (19) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సమీపంలోని గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి ఒంటిగంట సమయంలో కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై దివాన్ చెరువుకు బయలుదేరారు. బొగ్గు లారీ వేగంగా వచ్చి దివాన్‌చెరువు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్రవాహనాన్ని కొద్దిదూరం లారీ ఈడ్చుకుపోవడంతో శరీర భాగాలు రహదారిపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటనా స్థలాన్ని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అడవులు విధ్వంసానికి పాల్పడితే చర్యలు

- అటవీశాఖ దళాధిపతి చిరంజీవ్ చౌదరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అడవుల విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవ్ చౌదరి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రంపచోడవరం డివిజన్ అటవీప్రాంతంలో టేకు, వివిధ రకాల చెట్ల నరికివేతలపై చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రూ.61లక్షల విలువైన 413 చెట్లను దుండగులు నరికివేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. అడవుల విధ్వంసాన్ని గుర్తించడంలో విఫలమైనందుకు రంపచోడవరం రేంజ్ అధికారిని సస్పెండ్ చేసి క్రమశిక్షణా చర్యల నిమిత్తం ఏటిసి జారీ చేశామన్నారు. 2022-23, 2023-24 మధ్యకాలంలో జరిగిన సిబిఈటి పనుల్లో అవకతవకల ఆరోపణలపై విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామని తెలిపారు.

యధావిధిగా మద్యం దుకాణాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎపి బేవరేజ్ కార్పోరేషన్ సేల్స్‌మెన్స్ అండ్ సూపర్‌వైజర్స్ అసోషియేషన్ చేపట్టిన మద్యం దుకాణాల బంద్‌ను నిరవధికంగా వాయిదా వేసుకున్నందున యధావిధిగానే మద్య దుకాణాలు పని చేస్తాయని రాష్ట్ర ఎక్సయిజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సేల్స్‌మెన్స్, సూపర్‌వైజర్స్ సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చినందున వారు బంద్‌ను ఉపసంహరించుకున్నారని తెలిపారు.